# రాతిగింజ

"ఖలీల్"

మునుపు ఎన్నడూ వినని గొంతు.

"ఇది ఖలీల్ నెంబరు కాదు" అన్నాను.

"మాట్లాడుతోంది ఎవరు?" అతని మాటలు దురుసుగా ఉన్నాయి.

"ఎవరయితేనేం" అన్నాను.

"నాకు ఖలీల్ కావాలి" అసహనంగా అన్నాడు.

"ఇది అతని నెంబరు కాదు. అటువంటి పేరుగల వాళ్ళు ఎవరూ ఇక్కడ లేరు."

"మాట్లాడేది ఎవరు?"

"ఎవరయితేనేం? రాంగ్ నెంబరు" సెల్ ఆపేశాను.

మా సంభాషణ ఉర్దూలోనే జరిగింది. నేను ఎవరికయినా పొరపాటున ఫోను చేస్తే సారీ చెప్పుకుంటాను. కొందరు చెప్పరు. ఫోను మనమే చేసినట్టు రుబాబుగా మాట్లాడుతుంటారు.

ఆ సాయంత్రం నాలుగింటికి ఉదయం ఫోను చేసినతనే తిరిగి ఫోను చేసి, "ఖలీల్ కావాలి" అన్నాడు.

"ఇది ఖలీల్ నెంబరు కాదు" అన్నాను.

"ఖలీల్ ఏ నెంబరులో దొరుకుతాడు?"

"అతనెవరో నాకు తెలియదు. అతనే నెంబరులో ఉంటాడని నన్నడిగితే ఏం చెప్పేది?" అని, అతని మాటలు వినడం ఇష్టంలేక సెల్ ఆపు చేశాను. ఉదయం నుండి ముంబయి నుండి ఒక కాల్ కోసం ఎదురు చూస్తున్నాను. రావడం లేదు. అయిదారుసార్లు ప్రయత్నించాను. దొరకడం లేదు. చిరాకుగా ఉంది.

మళ్ళీ ఆరింటికి ఆ నెంబరు నుండే రెండు సార్లు కాల్స్ వచ్చాయి. అతనికి ఖలీల్ కావాలి. తీయదల్చుకోకూడదని ముందు అనుకున్నాను. కానీ తీయకుండా ఉండలేకపోయాను. తాడోపేడో తేల్చుకుందామనుంది. సెల్ ఆన్ చేయగానే, "ఎవడ్రా మాట్లాడేది?" ఉదయం నుండి ఖలీల్ గురించి అడుగుతున్న కరుకుమాటే.

బి.పి.కరుణాకర్

ముక్కూ ముఖం తెలియని వాడి చేత 'రా' అనిపించుకోడానికి ఇష్టపడను. నా దగ్గర వాళ్ళంటే వేరేమాట.

"నువ్వెవడుబే మాట్లాడేది?" కోపంగా అన్నాను.

"రేయ్. లయిన్‌లో ఉండరా, నన్ను బే అంటావురా?" అరిచాడు.

"ఏం చేస్తావురా వెధవా. ఫోను పెట్టేయరా".

"నన్నే ఇన్ని మాటలంటావురా? నేనెవరో నీకు తెలిస్తే...." అతని పక్కనే ఎవరో ఉన్నట్టున్నారు, కోపంతో వణికిపోతే నన్ను ట్రేస్ అవుట్ చేయమని చెప్పడం నాకు వినబడుతూనే ఉంది. లేనిపోని తలనొప్పి తెచ్చుకున్నట్టనిపించింది. సెల్ ఆపుచేశాను.

అయిదు నిమిషాలు గడిచాక మార్చి మార్చి పావుగంటవరకు అతని సెల్‌నుండి నాకు విడవకుండా కాల్స్ వస్తూనే ఉన్నాయి. అందుకోలేదు. చేయనీ ఎన్నిసార్లు చేస్తారో అని మొండిగా ఉండిపోయాను. నేను చేసిన పొరపాటల్లా అతనితో ఉర్దూలో మాట్లాడడం. అతను ఉర్దూలో సంభాషణ మొదలుపెట్టాడు కాబట్టి నేనూ ఉర్దూలో మాట్లాడాల్సి వచ్చింది. మొదట్లోనే నేను తెలుగులో మాట్లాడి ఉంటే బావుండేది.

అరగంట తర్వాత మరో మూడు కొత్త నెంబర్ల నుండి ఆగకుండా ఫోన్లు రావడం మొదలెట్టాయి. తీయలేదు. ముంబయి కాల్ కోసం ఎదురు చూస్తున్నాను కాబట్టి సెల్ ఆపు చేయలేదు. విసుగుపుట్టి ఉండాలి. ఫోన్లు రావడం మానేశాయి. ఆ తర్వాత చూసుకుంటే నన్ను పచ్చి బూతులు తిడుతూ నూటఅరవయి మెసేజ్‌లు వచ్చాయి. నా మీద వాళ్ళ కోపం ఏ మేరకు ఉందో అర్థమయింది. నేనే ఖలీల్ నని నాకు తెలియకుండా వాళ్ళకు నమ్మకం కలిగించినట్టుంది. పోలీసు కంప్లయింట్ ఇవ్వొచ్చు. వాళ్లు సాల్వ్ చేస్తారని నాకు నమ్మకం లేదు. వాళ్లు పిలిచినప్పుడల్లా వెళ్తుండాలి. అదో తలనొప్పి. వాళ్ళ మెసేజ్‌లు సేవ్ చేశాను. తప్పదనిపిస్తే నేను చేసేది నేను చేస్తాను.

ఆమధ్య బాబ్రీ మసీదు తీర్పు విషయంలో ప్రభుత్వం విధించిన గంపగుత్త సమాచార నిషేధ విధింపు ఒక విధంగా నాకు మేలు చేసింది. దాదాపు మూడు వారాలవరకు వాళ్ళ నుండి నాకు ఎటువంటి సమాచారాలు అందలేదు. ఫోన్లూ రాలేదు. వాళ్ల బెడద తీరిపోయింది అనుకుంటూండగా ఒక రాత్రి ఎనిమిది దాటాక ఫోను వచ్చింది కొత్తనెంబరు. వాళ్ళ దగ్గరనుండేనని అనుమానం కలిగింది. అందుకున్నాను. ఈసారి ఉర్దూలో మాట్లాడదల్చుకోలేదు. తెలుగులో మాట్లాడదల్చుకున్నాను.

"హలో" అన్నాను.

"ఫలానా నెంబరేనా?" అని అవతలి వయుపు నుండి ఎవరో తెలుగులోనే స్పష్టంగా అడిగాడు. మునుపు నాకు ఫోను చేసిన వ్యక్తి స్వరం కాదది. కొత్తది.

"అవును" అన్నాను.

"ఎవరు మాట్లాడుతుంది?" మాట మెత్తగా ఉంది.

"మీకు ఎవరు కావాలి?"

"నాకు ఖలీల్ కావాలి."

"ఇది ఖలీల్ నెంబరు కాదు"

"ఎవరిది?"

నాకు వొళ్ళు మండడం మొదలయింది. "నాది" అన్నాను.

"మీపేరు?"

"నాపేరుతో మీకు పనేమిటి? అసలు మీరు ఎవరు? మీపేరు చెప్పండి." దబాయించాను.

"ఈ నెంబరు ఖలీల్‌ది. మీకెలా వచ్చింది?"

"కంపెనీ నుండి కొనుక్కున్నాను."

"ఏ కంపెనీ?"

"సెల్ నెంబరు బట్టి ఏ కంపెనీయో తెలుసుకోవచ్చు."

"ఇప్పుడు మార్చుకోవచ్చు కదా?"

"నేను మార్చుకోలేదు. మీరు ఎక్కడనుండి మాట్లాడుతున్నారు?"

"కాకినాడ".

"నేను మీకు దగ్గర్లోనే ఉన్నాను. మాది రాజమండ్రి. మీ పేరేమిటని ఇందాకే అడిగాను. చెప్పలేదు."

అతను తన పేరు చెప్పలేదు. సెల్ కట్ చేశాడు. నా మాటల్లోని కోపంతో అతను భయపడి ఉండాలి. నేను రాజమండ్రి నుండి మాట్లాడడం ఎంత నిజం కాదో అతను కాకినాడ నుండి మాట్లాడడం అంత అబద్ధమయి ఉండొచ్చు అనిపించింది.

పది నిమిషాల తర్వాత అతన్నుండి మళ్ళీ ఫోను వచ్చింది. ఈ సారి అతన్ని నేను వదలదల్చుకోలేదు. తీసుకున్నాను.

"మీ పేరు అడుగుతోంటే ఫోను పెట్టేశారేమిటి?" కోపంగా అడిగాను.

"చెపుతా..."

అతని మాటలకు అడ్డు తగిలి, "మీరు మాట్లాడుతోంది కాకినాడ నుండి కాదు. హైదరాబాద్ నుంచి. అవునా?" స్వరం పెంచాను.

అతను వెంటనే జవాబు చెప్పలేదు. పావునిమిషం పాటు ఆగి "కాదు" అన్నాడు దాదాపు అరుస్తున్నట్టుగా.

"ఎందుకురా అలా అరుస్తావు?" నాకు అటో ఇటో తేల్చుకోవాలని ఉంది. వదిలిపెట్టదల్చుకోలేదు.

"సారీ... మీకీ సెల్....?"

"దొంగతనం చేశాను."

"పోలీసు కంప్లయింట్ ఇచ్చేదా?"

"వెంటనే ఇవ్వు. ఇందులో ఉన్న నెంబర్లు పోలీసు వాళ్లకు ఉపయోగపడతాయి" అరుస్తున్నట్టు అన్నాను. అలా ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడలేదు. నా కంఠస్వరం నాకూ కొత్తగా ధ్వనించింది. అంత ధయిర్యంగా ఎలా అనగలిగానో నాకే అర్థం కాలేదు. నా మాటలకు భయపడినట్టుంది. ఫోను ఆపేశాడు.

భోజనం చేసి నిద్రపోదామనుకునేంతలో మరో నెంబరు నుండి ఫోను వచ్చింది. తీసుకున్నాను.

"హలో" అన్నాడు.

ఇందాకటి వ్యక్తి కాదు. కొత్త స్వరం. ఇప్పుడు నా ఎదురుగా ఉన్న సమస్య ఏం చేయడం? ఇందాకటిలా అరవదల్చుకోలేదు.

"చెప్పండి." అన్నాను.

"సారీ. మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు క్షమించండి..." స్పష్టమయిన తెలుగులో అన్నాడు.

అతనే అన్నాడు, "ఎంతో అవసరమయి మీకు ఇన్నిసార్లు ఫోన్లు చేయాల్సి వస్తోంది. దయచేసి ఏమనుకోకండి. ఖలీల్ నా కజిన్. నెలరోజుల కిందట ఒక ముఖ్యమయిన పనిమీద నాందేడ్ వెళ్ళమని పంపించాం. నాందేడ్ చేరుకోలేదు. ఏమయిపోయాడో తెలియదు. చనిపోయి ఉండడు. అతని గురించే మేమందరం ఆందోళన పడుతున్నాం. అందుకే ఒకరి తర్వాత ఒకరం మీకు ఫోన్లు చేస్తూ ఉన్నాం...." అంటోంటే అతని మాటలకు అడ్డు తగిలి, "మొదట్లో నాతో మాట్లాడినతను మంచిగా మాట్లాడి ఉంటే నేనూ మర్యాదగా మాట్లాడి ఉండేవాడిని" అన్నాను.

"నేనూ అదే అనుకుని చివర్లో రంగంలోకి దిగాను. మొదటినుంచి మా వాళ్ళకు చెపుతున్నాను మీరు మా ఖలీల్ కాదని. నామాట వింటేనా? ఎక్కడో పొరపాటు జరిగింది. ఒక్క సంగతి చెప్పండి. ఈ సెల్ నెంబరు ఖలీల్‌ది. మీ కెలా వచ్చింది?"

"నేను ఈ నెంబరును అయిదేళ్ళ నుండి వాడుతున్నాను. ఈ మధ్య తీసుకున్నదేమీ కాదు."

"ఎక్కడ కొన్నారు?"

"హైదరాబాదులో"

"హైదరాబాద్‌లోనే. ఎక్కడని?"

"లిబర్టీ దగ్గర. మీవాడు కొనుక్కొని ఎంతకాలమవుతోంది?"

"తెలియదు. వాడితో వచ్చిన సమస్య ఏమిటంటే ఏ విషయం పూర్తిగా చెప్పడు. వాడిని నమ్మబుద్ధి కాదు. అలా అని నమ్మకుండా ఉండలేం. ఏదయినా పనిచ్చి చేసిరమ్మంటే పర్‌ఫెక్ట్‌గా చేసి తిరిగి వస్తాడు. మీ దగ్గరున్న నెంబరు ముమ్మాటికీ వాడిదే. ఇలా అడుగుతన్నందుకు మీరేమీ అనుకోవద్దు. వాడి దగ్గర డబ్బులు లేక ఈ సెల్ మీకు గాని అమ్మాడా? లేక వాడితో మీకు పరిచయం ఉందా?"

"లేదు.. మీరు మళ్ళీ మొదటికి వస్తున్నారు.... మీరు సరాసరి కంపెనీకి వెళ్ళి వివరాలు తీసుకోవచ్చు. ఎవరు, ఎప్పుడు కొన్నదీ తెలిసిపోతుంది. నేను దొంగిలించానని మీకు అనుమానంగా ఉంటే సరాసరి పోలీసు స్టేషన్‌కు వెళ్ళి కంప్లెయింట్ ఇవ్వండి.

"ఇంకొక విషయం మీ వాళ్ళెవరో నాకు అసభ్యకరమయిన మెసేజ్‌లు ఇచ్చారు. అలా ఇవ్వడం ఎంత తప్పో నేను పోలీసు కంప్లయింట్ ఇస్తేగాని తెలియదు. మీ వాళ్ల నుండి నాకు మళ్లీ మళ్లీ ఫోన్లు గాని, మెసేజ్‌లుగాని వస్తే నేనూరుకోను. సరాసరి పోలీసు స్టేషన్‌కు వెళ్తాను. డొంకంతా కదులుతుంది...." అన్నాను.

వాళ్లు సెల్‌కంపెనీకి గాని పోలీసుల దగ్గరకు వెళ్తారని నేను అనుకోను. తీగ లాగలేరు. లాగరు.

"ఎక్కడ నుండి మాట్లాడుతున్నారు?" అడిగాను.

"హైదరాబాద్ నుండి"

"మీ పేరు?"

"సాహు..... మీపేరు?"

అప్పుడు బాంబు పేల్చాను.

"ఖలీల్" అన్నాను.

* నవ్య వీక్లీ 2011